సాక్షి నంద్యాల

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



కనిపించని క'రుణ'

సి.బెళగల్: దివ్యాంగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇప్పటి వరకు రుణాలు ఇవ్వకపోవడంతో బుధవారం వారు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు.



'ఉపాధి'లో భారీ అవినీతి

కల్లూరు: 'ఉపాధి' పనుల్లో భారీ అవినీతి జరుగుతున్నట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడవుతోంది. కల్లూరు మండలంలో రూ.5.39లక్షలు అవినీతి జరగగా రికవరీ చేయించాలని ఆదేశించారు.



అగ్నివీర్‌లో మెరిసి..

ఆస్పరి మండలంలోని యువకులు అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించారు. వీరంతా వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు. ఏపీ మోడల్ స్కూల్‌లో చదివి ప్రతిభ చాటారు. 8లో▸

న్యూస్‌రీల్

లక్ష్మమ్మ అవ్వకు బంగారు కిరీటం



సిద్ధంగా ఉన్న బంగారు కిరీటం

ఆదోని అర్బన్: ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వకు బంగారు కిరీటం తయారయ్యింది. మేలో జరగబోవు అవ్వ 93వ రథోత్సవం సందర్భంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య కేజీ మూడు గ్రాముల బంగారు కిరీటాన్ని చేయించారు. కిరీటాన్ని దేవదాయ శాఖ అధికారుల అనుమతితో చేయించినట్లు రాచోటి రామయ్య బుధవారం తెలిపారు. కిరీటాన్ని తయారు చేయడానికి సహకరించిన బంగారు దుకాణ దారులకు, ఎండోమెంట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రశాంతంగా 'జేఈఈ మెయిన్స్'



కర్నూలు సిటీ: జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి జేఈఈ మెయిన్స్ తుది విడత పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి గంటన్నర ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. వేళకు 40 నిమిషాల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ పరీక్షలు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిర్వహించారు. కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టుకు సమీపంలోని సనత్‌నగర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉదయం 274 మందికిగాను 259 మంది, మధ్యాహ్నం 263 మందికిగాను 249మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈనెల 09వ తేదీ వరకు జరగనున్నాయి.

ఆర్‌యూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



వర్సిటీలోని వివిధ విభాగాల అధిపతులతో సమావేశమైన ఇన్‌చార్జ్ వీసీ ఉమ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వి.ఉమ సూచించారు. ఆర్‌యూ, క్లస్టర్ (సీయూ) యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీగా నియమితులైన ఆమె బుధవారం ఆర్‌యూను సందర్శించారు. వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య సీవీ సుందరనాంద్, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో సమావేశమై వర్సిటీకి సంబంధించిన విషయాలను చర్చించారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో పాటు, వర్సిటీలోని వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు ఇన్‌చార్జ్ వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహానందిలో కూల్‌పెయింట్



మహానంది: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం కూల్ పెయింట్ వేయించారు. భక్తులకు కాళ్లు కాలకుండా మహాద్వారం ముందు, నంది వరకు కూల్ పెయింట్ వేశారు. ఇదిలా ఉండగా రాజగోపురం ముందు భాగంలో పాత పెయింట్‌తోనే సరిపెట్టారు.

18న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 18వ తేదీన శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి పాలపండ్ల వృషభాల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేల నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.



ఆసుపత్రిలో నిలిచిపోయిన ఐపీ భవనం పనులు

వేదనాసుపత్రి!

సమస్యల వలయంలో పెద్దాసుపత్రి

- బోధనాసుపత్రిపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు
- నిధులు కేటాయించక నిలిచిన నిర్మాణాలు
- నత్తనడకన సాగుతున్న డ్రగ్ కంట్రోల్ ల్యాబ్
- గత ప్రభుత్వంలో నాడు–నేడుతో ఎనలేని ప్రగతి
- ఆసుపత్రి చరిత్రలోనే అత్యధికంగా పోస్టుల భర్తీ
- నేడు పీజీ సీట్లు కోల్పోయే పరిస్థితి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన భవనాలు, పాత భవనాల్లో చాలీచాలని వసతులు, మందుల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళాశాలపై చిన్నచూపు చూడటమే ఈ పరిస్థితికి కారణమవుతోంది. రూ.500కోట్ల అంచనాతో చేపట్టిన అభివృద్ధి పనులను పట్టించుకోకపోవడం వల్ల ఆసుపత్రిలో అడుగడుగునా ఇబ్బంది తలెత్తుతోంది. రాజధాని కర్నూలు నుంచి హైదరాబాద్‌కు తరలిన నేపథ్యంలో ఏర్పాటైన కర్నూలు మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ అభివృద్ధి నత్తనడకన సాగింది. 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభమైన ఈ కళాశాల ప్రస్తుతం 250 సీట్లకు నోచుకుంది. అది కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో 50 సీట్లు వచ్చాయి. గతంలో సూపర్‌స్పెషాలిటి పీజీ చదవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిలో గత ప్రభుత్వం దాదాపు అన్ని విభాగాల్లో పీజీ సీట్లను మంజూరు చేసింది. అలాగే స్పెషాలిటీ కోర్సుల్లోని పీజీ సీట్లు 2019కి ముందు 138 మాత్రమే ఉండగా.. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో అదనంగా మరో 26 సీట్లు పెరిగి మొత్తం పీజీ సీట్ల సంఖ్య 164కు చేరింది. 2019కి ముందు ఆసుపత్రిలో 300 వరకు మాత్రమే స్టాఫ్‌నర్సులు ఉండగా.. ఆ సంఖ్యను గత ప్రభుత్వం 800లకు చేర్చింది. ఫలితంగా రోగులకు నర్సింగ్ సేవలు చేరువయ్యాయి. ఇక 2019 వరకు 140 దాకా ఉన్న పీజీ సీట్ల సంఖ్య గత ప్రభుత్వంలో మరో 35 మంజూరయ్యాయి. అదేవిధంగా 2019 వరకు కేవలం నాలుగు మాత్రమే ఉన్న సూపర్‌స్పెషాలిటీ సీట్ల సంఖ్య ఏకంగా 19కి చేరుకోవడం గత వైఎస్సార్‌సీపీ ఘనతగా ఆసుపత్రిలోనే చర్చ జరుగుతోంది.

ఆగిపోయిన అభివృద్ధి పనులు

- ➤ గత వైసీపీ ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు నిర్మాణాలు ప్రారంభించింది.
- ➤ ఇందులో భాగంగా రూ.350కోట్లు నిర్మాణాలకు, రూ.150కోట్లు పరికరాలకు కేటాయించారు.
- ➤ ఇందుకు సంబంధించి ఐపీ భవనం, కళాశాలలో లెక్చరర్ గ్యాలరీలు, సెమినార్‌హాల్స్, హాస్టళ్ల నిర్మాణాల పనులు కొనసాగాయి.
- ➤ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వీటి నిర్మాణాలు ఆగిపోయాయి.
- ➤ శరవేగంగా పనులు జరుగుతున్న ఐపీ భవనం, 80 శాతానికి పైగా పూర్తయిన లెక్చరర్ గ్యాలరీ, డ్రగ్ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్ పనులు నిలిచిపోయాయి.
- ➤ ఐపీ భవన నిర్మాణం ఆగిపోవడం వల్ల పాత భవనాల్లో ఇరుకు పరిస్థితుల్లోనే రోగులకు చికిత్స చేస్తున్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి గండం

ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) గండం పొంచి ఉంది. గత ప్రభుత్వంలో ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేవారు. దీంతో పాటు ఈ విభాగానికి పీజీ సీట్లు కూడా మంజూరు కావడంతో అధిక సంఖ్యలో పీజీ వైద్యులు ఉన్నారు. దీనివల్ల ఇక్కడ సేవలు గణనీయంగా పెరిగాయి. ఆ తర్వాత కొంత కాలానికి ఇక్కడ పనిచేసే ప్రొఫెసర్ రిటైర్ కావడం, ఇద్దరు అసిస్టెంట్లు లాంగ్ లీవ్ పెట్టడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఒక్కరే అన్ని పనులూ చేయాల్సి వస్తోంది. రోగులకు వైద్యం అందిస్తూ పీజీలకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో టీచింగ్ ఫ్యాకల్టీ లేరని చెబుతూ ఉన్న పీజీ సీట్లను ఎన్‌ఎంసీ రద్దు చేసే ప్రమాదం పొంచి ఉందని వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

వైద్యుల నియామకాలు, పదోన్నతులు గత ప్రభుత్వంలోనే..

కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా 126 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగింది. ఈ మేరకు అప్పటి వరకు అసోసియేట్‌గా పదోన్నతులు లభించని అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేశారు. దీంతో పాటు అదనంగా నాలుగు ప్రొఫెసర్, 22 అసోసియేట్, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశారు. వైద్యులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించేందుకు ముందుగా దీర్ఘ కాలంగా ఒకేచోట ఉన్న వారిని బదిలీ చేశారు. అనంతరం సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించి కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించారు. ఆ తర్వాత పరస్పర బదిలీలనూ నిర్వహించారు. ఈ క్రమంలో కోరుకున్న ప్రాంతానికి చాలా మంది వైద్యులు చేరుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో పోస్టుల భర్తీ లేదు, పదోన్నతుల ఊసే లేకపోవడం గమనార్హం.

నత్తనడకన రీజినల్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబోరేటరీ పనులు

నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగానే రీజినల్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబోరేటరికి 2019లోనే నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. 2023లో ఇందుకు సంబంధించి అగ్రిమెంట్ చేసుకున్నాక పనులు ప్రారంభమయ్యాయి. రూ.1.79కోట్లతో ఈ పనులు కొంత కాలం వేగంగా కొనసాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇవి పూర్తయితే ఔషధ నియంత్రణ శాఖ పరిపాలనా విభాగంతో పాటు రాయలసీమ స్థాయిలో ఔషధాలను పరీక్షించేందుకు ల్యాబోరేటరీ కూడా అందుబాటులోకి రానుంది.

బిల్లుల పెండింగ్ వల్లే ఆలస్యం



ఆసుపత్రిలోని ఐపీ భవనం, లెక్చరర్ గ్యాలరీ తదితర పనులు నిధుల లేమి వల్లే నిలిచిపోయాయి. ఈ రెండు పనులూ ఒకే అగ్రిమెంట్ కింద అయ్యాయి. ఒకే కాంట్రాక్టర్ పని చేస్తున్నాడు. అతనికి రూ.17.89కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికోసం ఎదురుచూస్తూ పనులు నిదానం చేస్తున్నారు. బిల్లులు రాగానే పనుల్లో వేగం పుంజుకునే అవకాశం ఉంది.

– ఎస్.కరీముల్లా, ఏపీఎంఎస్ఐడీసీ ఇన్‌చార్జి ఈఈ, కర్నూలు

నేడు కర్నూలుకు మాజీ సీఎం వైఎస్ జగన్



కర్నూలు(టౌన్): మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గురువారం కర్నూలుకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు కర్నూలులోని జొహరాపురం రోడ్డులో ఉన్న మైసర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో కుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో మాజీ సీఎం పాల్గొంటారు. వధూవరులను ఆశీర్వదించి వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడిన అనంతరం ఆయన తిరిగి 12.50 గంటలకు తాడేపల్లికి బయలుదేరి వెళ్తారు. మాజీ సీఎం పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్‌లు పరిశీలించారు. ఏర్పాట్లపై కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌తో చర్చించారు.



హెలిప్యాడ్ ఏర్పాట్లపై డీఎస్పీతో చర్చిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు

రీవాల్యుయేషన్‌లో 200 మంది ఉత్తీర్ణత

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) 4, 1వ సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశారు. 4వ సెమిస్టర్‌కు 108 మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 52 మంది, 1వ సెమిస్టర్‌కు 350 మంది దరఖాస్తు చేసుకోగా 148 మంది.. మొత్తం 200 మంది ఉత్తీర్ణత సాధించారు.

కిక్కున్న పోస్టింగులే కావాలి!

ఎక్సైజ్‌లో ఎస్‌ఐ పోస్టింగులకు రంగం సిద్ధం

- ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, కర్నూలు స్టేషన్‌కు తీవ్ర పోటీ
- ఉమ్మడి జిల్లాలో 10 ఎస్‌ఐ పోస్టులు ఖాళీ
- పదోన్నతి పొందిన వారితో భర్తీకి కసరత్తు పూర్తి

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో 52 ఎస్‌ఐ పోస్టులు ఖాళీగా ఉండగా అడ్‌హాక్ పద్ధతిలో ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు పోస్టింగులు కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అర్హుల జాబితా రూపొందించి ఇటీవల దేహదారుఢ్య, వైద్య పరీక్షలు పూర్తి చేశారు. ఇందులో 43 మంది ఎస్‌ఐలుగా పదోన్నతికి అర్హత సాధించారు. కర్నూలు జిల్లాలో ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు క్లర్కులు ఎస్‌ఐలుగా పదోన్నతికి అర్హత సాధించగా వారికి ప్రస్తుతం స్థానాలు కేటాయించేందుకు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి కసరత్తు పూర్తి చేశారు. దీంతో ఆశావహులు అధికార పార్టీ నేతలను ఆశ్రయించి కోరుకున్న స్థానాలను దక్కించుకునేందుకు పావులు కదుపుతుండటంతో డీసీ రహస్యంగా పోస్టింగులు కేటాయించే పనిలో ఉన్నట్లు సమాచారం.

తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు

కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు, పత్తికొండ, కర్నూలు స్టేషన్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పంచలింగాల చెక్‌పోస్టులో ఎస్‌ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని పదోన్నతి పొందిన వారితో భర్తీ చేయాల్సి ఉంది. ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, కర్నూలు స్టేషన్లకు తీవ్రంగా పోటీ ఉండగా.. ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు, పత్తికొండ స్టేషన్లతో పాటు పంచలింగాల చెక్‌పోస్టుకు ఇద్దరేసి చొప్పున పోటీ పడుతున్నారు.

- ➡ అనంతపురం జిల్లాకు చెందిన రవితేజ ఆ శాఖ మంత్రి సిఫారసు మేరకు కర్నూలు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని కోరుతున్నట్లు సమాచారం.
- ➡ అలాగే అనంతపురంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరసింహులు కూడా కర్నూలు లేదా బనగానపల్లె స్టేషన్‌ను కోరుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ మేరకు నోడల్ అధికారిపై ఆశావహులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.
- ➡ నంద్యాల జిల్లాలో బనగానపల్లె, నందికొట్కూరు స్టేషన్లతో పాటు ఎస్పీవై రెడ్డి డిస్టిలరీలో ఎస్‌ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉన్నందున ఎస్‌ఐగా పదోన్నతి పొందిన కొందరు ఆయా స్థానాలు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.
- ➡ పదోన్నతి పొందిన వారిలో ముగ్గురు ఏడాదిన్నరలో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో వీరు కూడా ఆదాయమున్న స్టేషన్లలో పోస్టింగులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

ఆటంకాలు సృష్టించడం చట్ట విరుద్ధం

- నేషనల్ హైవే 340సీ నిర్మాణానికి సహకరించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నందికొట్కూరు: నేషనల్ హైవే 340సీ నిర్మాణానికి ఆటంకాలు సృష్టించడం చట్ట విరుద్ధమని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. పాములపాడు మండలంలో నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు సృష్టించిన ప్రాంతాలను బుధవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పరిశీలించారు. ఎర్రగూడూరు, శారద ఇంగ్లిషు మీడియం హైస్కూల్, జెరూస్లెం చర్చి, రుద్రవరం టోల్‌ప్లాజా వద్ద, జూటూరు, కృష్ణారావుపేట ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు మంచి ఆలోచనలతో మార్కెట్ ధర మేరకు నేషనల్ హైవేకు భూములు ఇచ్చారని, అయితే మండ్లెం నుంచి 600 మీటర్ల వరకు అడ్డంకులు సృష్టించారన్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా క్రిష్టారావుపేటలో సుంకులమ్మ దేవాలయం, ఎర్రగూడూరులో మసీదు తొలగించారన్నారు. క్రిష్టారావుపేటలోని సుంకులమ్మ గుడి ప్రభుత్వ స్థలంలో నిర్మించడంతో నష్ట పరిహారం రాలేదని చెప్పారు. కోర్టు తీర్పు ప్రకారం ఈ నెల 5న జెరూస్సలేం చర్చి వద్ద రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. పాములపాడు మండల కేంద్రానికి సమీపంలో వ్యవసాయ భూమికి చెందిన బోరుపై రోడ్డు వేశారని జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు ఫిర్యాదు చేశారు. కొత్తపల్లి మండంలోని ప్రధాన పుణ్య క్షేత్రానికి భక్తులు వెళ్లటానికి వీలులేకుండా అండర్ పాస్ రోడ్డు వేశారని, ఒక సారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఆర్డీఓ నాగజ్యోతి, డీఎస్పీ రామాంజనేయులు నాయక్, తహసీల్దార్ నాగమణి, సీఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఎస్‌ఐలు సురేష్, లక్ష్మినారాయణ ఉన్నారు.

మద్దతిస్తే తీవ్ర పరిణామాలు



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు (సెంట్రల్): పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఎస్‌డీపీఐ రాష్ట్ర నాయకులు అమీర్ హెచ్చరించారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లౌకిక వాదం ముసుగు వేసుకుని వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడం అన్యాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రి



ఈఓకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, ఐఅండ్‌పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రి పొంగులేటి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొంగులేటి దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు మంత్రి దంపతులు రూ.10,11,116 విరాళాన్ని ఈఓకు అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి దేవస్థానం మంత్రి దంపతులను సత్కరించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మద్దికెర: మద్దికెర – మల్లప్పగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గుంతకల్లు రైల్వే ఎస్‌ఐ మహేంద్ర తెలిపిన వివరాలు.. దాదాపు 35 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రైలు నుంచి జారిపడి తలకు బలమైన తీవ్రగాయం కావడంతో మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. ఘటనా స్థలలో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తుపడితే 9866144616కు సమాచారం అందించాలన్నారు.

కుందూనదిలో పడి ఆర్టీసీ ఉద్యోగి..



చెన్నయ్య(ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన ఆర్టీసీ ఉద్యోగి ప్రమాదవశాత్తూ కందూనదిలో పడి మృతి చెందాడు. కోవెలకుంట్ల పోలీసులు అందించిన సమాచారం మేరకు కోవెలకుంట్లకు చెందిన గోగు చెన్నయ్య(52) స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం కాలికి పక్షవాతం సోకింది. అప్పటి నుంచి డిపో గ్యారేజిలో మెకానిక్‌గా ఉద్యోగాన్ని బదలాయించారు. చెన్నయ్యకు సోమవారం సెలవు కావడంతో పట్టణ శివారులోని కుందూనదిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి మునిగిపోయాడు. రెండు రోజులు అయినా ఇంటికి రాక పోవడంతో డ్యూటీ నిమిత్తం ఎక్కడికైనా వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే బుధవారం ఉదయం కుందూలో శవమై కనిపించాడు. మృతుడి భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగూర్‌వలి తెలిపారు.

కల్యాణం..కమనీయం



కైరుప్పలలో వీరభద్రస్వామి, కాళికాదేవి పెళ్లి జరిపిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండల పరిధిలోని కైరుప్పలలో వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున వీరభద్ర స్వామి, కాళికాదేవి కల్యాణం కమనీయంగా సాగింది. పిడకల సమరం అనంతరం పార్వతీ పరమేశ్వరుల సమక్షంలో ఒకటైన వీరభద్రస్వామి, కాళికాదేవిలకు పురోహితులు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో కల్యాణం కనుల పండువగా జరిపించారు. అనంతరం కాళికాదేవి, వీరభద్ర స్వామి, పార్వతీ సమేత పరమేశ్వరులను పల్లకీల్లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

నేడు వీరభద్ర స్వామి రథోత్సవం

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం మహా రథోత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సచివాలయమే.. నమ్మండి!



ఇదేదో టీడీపీ కార్యాలయం అనుకుని పొరపాటు పడేరు. ముమ్మాటికీ సచివాలయమే..నమ్మండి. కాకపోతే కూటమి ప్రభుత్వంలోని అరాచకాలకు ఇక్కడ ఎగరేసిన పచ్చ జెండానే నిదర్శనం. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసుకన్న పాలకులు ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలను సైతం 'పచ్చ'పాతంగా మార్చేస్తున్నారు. వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామంలోని సచివాలయం వద్ద ఇటీవల టీడీపీ నాయకులు తమ పార్టీ ఆవిర్భావ వేడుకలు చేసుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఏకంగా అక్కడ శాశ్వత దిమ్మ ఏర్పాటు చేసి టీడీపీ జెండా ఆవిష్కరించడం చూసి ప్రజలు నోరెళ్లబెడుతున్నారు. ఎంత బరితెగింపు పనికిరాదని ఈసడించుకుంటున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగులు, సంబంధిత అధికారులు తమకెందుకొచ్చిందంటూ చూసీచూడనట్లు విధులకు వచ్చిపోతున్నారు.

– వెల్దుర్తి

ఆటోఇటో అయితే..?



ఉపాధి పనులు పూర్తిస్థాయిలో కల్పించకపోవడం.. కల్పించినా కూలీ గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు గ్రామీణులు ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. పనుల కోసమని పొట్ట చేత పట్టుకుని కిలోమీటర్ల దూరం సైతం వెళ్లేందుకు వెనుకాడటం లేదు. ఇదే అదునుగా భావిస్తున్న వాహనాల డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకుని ప్రమాదకర స్థితిలో రాకపోకలు సాగిస్తున్నారు. నలుగురైదుగురు పట్టే ఆటోల్లో కిందా పైనా దాదాపు 25 మందికి పైగా కూలీలను ఎక్కిస్తున్నారు. ఓవర్‌లోడ్‌కు ఆటో కనుక అటో ఇటో అయితే మాత్రం కూలీల ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. బుధవారం మిరప కోతల నిమిత్తం కూలీలతో దొర్నిపాడు – చాకరాజువేముల మధ్య కిక్కిరిసి వెళ్తున్న రెండు వాహనాలను 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– దొర్నిపాడు

అగ్నివీర్‌లో మెరిసి.. ఆదర్శమై నిలిచి!

- సత్తా చాటిన ఆస్పరి యువకులు
- వీరంతా మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులే..
- హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

ఆస్పరి: వారి కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. తల్లిదండ్రులు పడే కష్టాలు కళ్లారా చూశారు. అయినా తమ పిల్లలు బాగుండాలనే ఉద్దేశంతో అప్పోసప్పో చేసి చదివించారు. వారి నమ్మకాన్ని ఆ పిల్లలు వమ్ము చేయలేదు. అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. గత మార్చి 28న గుంటూరులో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిపథ్ సెలక్షన్స్‌లో ఆస్పరి మండలానికి చెందిన ఐదుగురు యువకులు సత్తా చాటి జీడీ(జనరల్ డ్యూటీ) ఉద్యోగాలు సాధించారు. వీరంతా వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు కావడంతోపాటు టెన్త్, ఇంటర్ మండలంలోని పుటకలమర్రి సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలోనే పూర్తి చేశారు.



పుటకలమర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్

ఒకేసారి ఐదుగురు తమ పాఠశాల పూర్వ విద్యార్థులు ఇండియన్ ఆర్మీకి ఎంపికై తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవడంతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉద్యోగాలు సాధించిన యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పట్టుదలతో సాధన చేశా



అమ్మ బోయ లక్ష్మి, నాన్న రామన్నకు వ్యవసాయమే జీవనాధారం. నేను మోడల్ స్కూల్‌లో 2021 – 2023 మధ్య ఇంటర్ ఎంఈసీ పూర్తి చేశాను. ప్రస్తుతం గుంతకల్లులోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ఎస్‌కేపీ డిగ్రీ కాలేజీలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాను. ప్రతి రోజు ఉదయం పరుగు, షాట్ పుట్ సాధన చేసేవాడిని. ఆర్మీకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ట్రైనింగ్ నిమిత్తం ఈనెల 26న బెంగళూరుకు వెళ్తున్నా.

– మహీంద్రా, చిన్నహోతూరు గ్రామం, ఆస్పరి మండలం

గర్వంగా ఉంది



ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా ఎంపికైనందుకు గర్వంగా ఉంది. మా అమ్మ ఈరమ్మ, నాన్న శంకరయ్య వ్యవసాయం చేస్తున్నారు. పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు చదివిన స్కూల్‌కు మంచి పేరు తేవాలనే ఉద్దేశంతో పట్టుదలతో ఆర్మీ ఉద్యోగం సాధించాను. 2020–22 సంవత్సరంలో మోడల్ స్కూల్‌లో ఇంటర్ సీఈసీ చదివా. ఎమ్మిగనూరులో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఈనెల 27న బెంగళూరుకు ట్రైనింగ్‌కు వెళ్తున్నాను.

– గంగన్న, కలపరి గ్రామం ఆస్పరి మండలం

దేశానికి సేవ చేయాలని..



దేశానికి సేవ చేయాలనే ఇండియన్ ఆర్మీలో చేరేందుకు పట్టుదలతో సాధన చేశా. మా అమ్మ, నాన్న ఈరమ్మ, గోపాల్ వ్యవసాయ పనులు చేస్తున్నారు. నేను 2021–22లో మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదివాను. అగ్నివీర్‌లో జీడీగా ఎంపికయ్యాను. ఈనెల 24న హైదరాబాదుకు ట్రైనింగ్‌కు వెళ్తున్నాను. సైనికుడంటే ప్రజల్లో గౌరవం. అలాంటి పోస్టు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– రాఘవేంద్ర, కైరుప్పల గ్రామం, ఆస్పరి మండలం

మా పాఠశాలకు గర్వకారణం



మా స్కూల్‌లో చదివిన ఐదుగురు విద్యార్థులు ఒకేసారి ఇండియన్ ఆర్మీ లో చేరడం మా పాఠశాలకే గర్వకారణం. అగ్నివీర్‌లో ఎంపిక కావడంతో మా పాఠశాలకు మంచి పేరు వచ్చింది. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు.

– శమీల, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, ఆస్పరి మంలం

సంతోషంగా ఉంది



మా అమ్మానాన్నలు జయలక్ష్మి, నారాయణ వ్యవసాయం చే స్తూ నన్ను చదివిస్తున్నారు. 2020 – 2022 మధ్య మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఎంపీసీ పూ ర్తి చేశాను. ఆదోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ(ఎంపీసీయస్) పూర్తి చేశాను. ఇటీవల అగ్నివీర్ సెలక్షన్‌లో జీడీ ఉద్యోగం సాధించాను. ఈనెల 28న బెంగళూరు లో ట్రైనింగ్‌కు వెళ్తుండటంతో సంతోషంగా ఉంది.

– అజయ్‌కుమార్ తంగరడోన గ్రామం, ఆస్పరి మండలం

కల నెరవేరింది



అమ్మానాన్న ఉమాదేవి, గోవింద్‌లు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. వారి కలతో పాటు సైనికుడిగా దేశానికి సేవ చేయాలనే నా కల కూడా నెరవేరింది. అగ్నివీర్‌లో జీడీగా ఎంపికయ్యా. ఈనెల 24న నాసిక్‌లో జరిగే ట్రైనింగ్‌కు వెళ్తున్నా. 2021–23 వరకు మోడల్ స్కూల్‌లో ఇంటర్ సీఈసీ పూర్తి చేసి కోడుమూరులో డిఫెన్స్ కోచింగ్ తీసుకున్నా.

– రామచంద్ర, పుటకలమర్రి గ్రామం, ఆస్పరి మండలం

క్రీడల్లోనూ ప్రోత్సహిస్తాం



విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నాం. గతంలోనూ స్పోర్ట్స్ కోటాలో మా స్కూల్‌లో చదివిన నలుగురు విద్యార్థులు సైనికులుగా ఉద్యోగాలు సాధించారు. ఇప్పుడు మరో ఐదుగురు అగ్నిపథ్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– రాముడు, పీఈటీ, మోడల్ స్కూల్, ఆస్పరి మండలం

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య



నరేంద్ర(ఫైల్)

పగిడ్యాల: భార్య కాపురానికి రావడంలేదనే మనస్తాపానికిలోనైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పాతముచ్చుమర్రి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శాలుబాషా కుమారుడు నరేంద్ర(28)కు సి.బెళగల్‌కు చెందిన పవిత్రతో వివాహమైంది. వీరికి ఏడాది కుమార్తె ఉంది. భార్యా, భర్తల మధ్య కుటుంబ కలహాలు నెలకొనడంతో పవిత్ర కొంతకాలం క్రితమే పుట్టినింటికి వెళ్లింది. పలుమార్లు పెద్దమనషులతో పంచాయితీ చేసినా ఆమె రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికిగురైన నరేంద్ర మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్సనిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు



తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కర్నూలు: ఏపీ పొల్యూషన్ బోర్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పి.ప్రశాంతి (10), 3వ తరగతి చదువుతున్న పి.ప్రదీప్ తప్పిపోయినట్లు తెలుసుకున్న పోలీసులు గంట వ్యవధిలోనే వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన ప్రభుదాస్ కర్నూలు వీనస్ కాలనీలో ఉన్న బాలాజీ నివాస్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య మాధవి కూడా అక్కడే ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిద్దరి పిల్లలు మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయారు. సమీపంలోని సాయిసదన్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే వారు లేకపోవడం, కింద చీకటిగా ఉండటంతో భయపడి మూడో అంతస్థులోనే ఉండిపోయారు. తల్లిదండ్రులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో వెంకటరమణ కాలనీలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సీఐ నాగరాజరావు తన సిబ్బందితో చిన్నారులను వెతికిపట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సరదాగా ఆడుకుంటూ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేని స్థితిలో ఉన్న పిల్లల ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చినందుకు సీఐతో పాటు గస్తీ సిబ్బందిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

సూక్ష్మ సేద్యం పరికరాల్లో నాణ్యత ప్రధానం



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం పరికరాల్లో నాణ్యత ప్రమాణాలు ఉండాలని, అప్పుడే డ్రిప్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తుందని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సూక్ష్మ సేద్య లక్ష్యం 7,000 హెక్టార్లు ఉండగా ... 5,653 హెక్టార్లకు పరిపాలన అనుమతులు తీసుకున్నామన్నారు. బుధవారం కర్నూలులోని ఉద్యానభవన్‌లో ఉద్యాన అధికారులు, డ్రిప్ కంపెనీల ఇంజినీ ర్లు, జిల్లా కో–ఆర్డినేటర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ పీడీ పాల్గొని ప్రసంగించారు. పరిపాలన అనుమతులు పొ ందిన వారందరికీ మే చివరిలోపు డ్రిప్ పరికరాలు సరఫరా చేసి, అమర్చాలని కంపెనీల కో–ఆర్డినేటర్లను ఆదేశించారు. ఏపీడీ రాజాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ సేద్యం ప్రగతిలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో ఉందన్నారు. ఇందుకు సహకరించిన కంపెనీల కో–ఆర్డినేటర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, సూ క్ష్మనీటి అభివృద్ధి అధికారి జయరాం రెడ్డి పాల్గొన్నారు.


రేపు కర్నూలులో జాతీయ రైతు సదస్సు



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 4న కర్నూలులో నిర్వహించే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య కోరారు. నగరంలోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో జరిగే సదస్సుకు కేరళ, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రులు పి.ప్రసాదు, తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఉమ్మడి ఏపీ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, రఘువీరా రెడ్డి, కిసాన్ సభ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మహాసభలు జరగనున్న నేపథ్యంలో కర్నూలులో 4న జాతీయ రైతు సదస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాతబస్టాండులోని శ్రీలక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో జరిగే సదస్సులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి జాతీయ మహాసభల్లో తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా పంట రుణాలను మాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పంపన్న గౌడ్, ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లిఫ్ట్ కింద నీటి మడుగు



లిఫ్ట్ కింద ఏర్పడిన నీటి మడుగు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ వద్ద ఉన్న లిఫ్ట్ కింద నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా తరచూ లిఫ్ట్ పనిచేయక మొరాయిస్తోంది. ఒకవేళ పనిచేసినా ఎప్పుడు ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఈ లిఫ్ట్ క్యాజువాలిటీ నుంచి మొదటి అంతస్తులో ఉన్న పలు ఓపీ విభాగాలకు, రెండో అంతస్తులో ఉన్న పరిపాలనా విభాగానికి అనుసంధానంగా ఉంది. లిఫ్ట్ ద్వారానే ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది వెళ్లి వస్తూ ఉంటారు. లిఫ్ట్ కింద నీరు చేరుతుండటంతో తరచూ పనిచేయక ఆగిపోతోంది. నీరు ఎక్కడినుంచి వస్తుందో తెలియడం లేదు. ఈ నీటి ద్వారా విద్యుదాఘాతం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు, సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు

– కర్నూలు(హాస్పిటల్)

విద్యార్థుల చేతికి ట్యాబ్‌లు



విద్యార్థులకు తిరిగి ట్యాబ్‌లను అందించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

డోన్ టౌన్: విద్యార్థుల నుంచి తీసుకున్న ట్యాబ్‌లను ఎట్టకేలకు తిరిగిచ్చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విద్యార్థుల భవిష్యత్ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించిన సంగతి తెలిసినదే. ఈనెల 1న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ స్థానిక ఏపీ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినుల నుంచి ట్యాబ్‌లు లాగేసుకున్నారు. ఈ విషయమై కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్ద నరసనలు వ్యక్తం చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో విషయం తెలుసుకున్న సాక్షి దినపత్రిక.. 'ట్యాబ్‌లు లాగేసుకుంటున్నారు' శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించారు. ఇంటెలిజెన్స్, విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ట్యాబ్‌లు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. దీంతో బుధవారం హెచ్‌ఎం సుస్మితతో పాటు ట్యాబ్‌లు తీసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు ఫోన్ చేసి పాఠశాలకు పిలిపించి ట్యాబ్‌లు ఇచ్చేశారు.

విజిలెన్స్ దాడులు



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ పౌరసరఫరాల అధికారులు రెండో రోజు బుధవారం దాడులు కొనసాగించారు. ముగ్గురు ఎండీయూ ఆపరేటర్లు, రెండు రేషన్ షాపులపై దాడులు చేశారు. ఎండీయూ ఆపరేటర్ సాయి మహేష్ (11వ నంబర్)పై దాడి చేయగా ఉండాల్సిన బియ్యం కన్నా 593 కేజీలు తక్కువగా ఉండడంతోపాటు 164 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే రేషన్ షాపు నంబర్ 113పై దాడి చేయగా డీలర్ సుజిత్‌కుమార్ వద్ద ఉండాల్సిన బియ్యం కంటే 86 సంచులు తక్కువగా ఉండడంతో అతనిపై కూడా 6ఏ కేసు నమోదు చేశారు. ఆయా దాడుల్లో డీఎస్‌ఓ రాజారఘువీర్, ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.